
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం ı 17 ı అక్టోబర్ ı 2024



కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టంగా రూ.26, సరాసరిన రూ.36 ప్రకారం ధర పలికింది.



నేడు వాల్మీకి జయంతి

మహర్షి వాల్మీకి జయంత్యుత్సవాన్ని గురువారం పుట్టపర్తి సాయిఆరామంలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
26.6°/20.8°

జిల్లాలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై జిల్లా అంతటా జడితో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వార్టర్‌పై రూ.30 అదనం

- తొలిరోజే ఎమ్మార్పీకి మంగళం



ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్న మద్యం దుకాణం

పెనుకొండ రూరల్: నాణ్యమైన మద్యం..ఎమ్మార్పీకే అంటూ చంద్రబాబు సర్కార్ చెప్పినా...మద్యం దుకాణాలు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు తొలిరోజే ఎమ్మార్పీకి మంగళం పాడారు. సోమ, మంగళవారాల నుంచే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం దొరక్కపోవడంతో బుధవారం మద్యం ప్రియులు దుకాణాల వద్ద బారులు తీరారు. దీంతో పెనుకొండలోని ఓ దుకాణంలో క్వార్టర్ మీద రూ.30 అదనంగా వసూలు చేశారు. దీనిపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సృజన్ బాబును 'సాక్షి' వివరణ కోరగా, తాను నూతన మద్యం పాలసీ పనుల్లో బిజీగా ఉన్నానని, మద్యం విక్రయాలపై దృష్టి సారించలేకపోయానన్నారు.

పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. పీజీ ఎంట్రెన్స్-2024లో అర్హత సాధించి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వారంలో రెండు రోజులు మెడికల్ సర్టిఫికెట్ల జారీ

అనంతపురం మెడికల్: వారంలో రెండు రోజులు మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22 తర్వాత వచ్చే ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా, బోదకాలు, పక్షవాతం, ప్రమాదంలో వీల్ చైర్‌కు పరిమితమైన వారు, డయాలసిస్, కిడ్నీ తొలగించుకున్న వారు ఆయా రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సంప్రదించాలన్నారు.



చిలమత్తూరు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న జయమంగళి నది



వర్షపునీరు చేరడంతో నిండుకుండలా మారిన పరిగి చెరువు

వాన.. హైరానా

అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ జడితో కూడిన మోస్తరు వాన పడింది. నదుల్లోకి నీరు చేరగా జలకళను సంతరించుకున్నాయి. తాజా వర్షాలతో ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అక్కడక్కడా శిథిలావస్థలో ఉన్న ఇళ్లు నేలకూలాయి.

జిల్లా అంతటా జడివాన

- ఒక్కరోజే 35.4 మి.మీ సగటు వర్షపాతం నమోదు
- జయమంగళి, చిత్రావతి నదులకు జలకళ
- పొంగిపొర్లిన చెక్‌డ్యాంలు.. పలుచోట్ల గండ్లు
- ఖరీఫ్ పంటలకు తీరని నష్టం



శ్రీరంగరాజుపల్లి వద్ద కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు



బత్తలపల్లి మండలం సంజీవపురం ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఒక్కరోజే 35.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటలకు పుట్టపర్తి మండలంలో 66.2 మి.మీ, బుక్కపట్నంలో 59.8 మి.మీ, ముదిగుబ్బ 56.4 మి.మీ, కొత్తచెరువు 55 మి.మీ, గోరంట్ల, పెనుకొండ మండలాల్లో 51.5 మి.మీ వర్ష పాతం నమోదైంది. ఇక నల్లమాడ 50.8 మి.మీ, ధర్మవరం 45.8, రొద్దం 44.0, సీకేపల్లి 43.6, ఓడీసీ 43.2, సోమందేపల్లి 42.8, గాండ్లపెంట 37,6, అమడగూరు 35.6, తనకల్లు, ఎన్పీ కుంట, రామగిరి మండలాల్లో 33 మి.మీ, కదిరి 31.2, తలుపుల 31.0, మడకశిర మండలంలో 29.6 వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లోనూ మోస్తరు వర్షాలు కురవడంతో 16 మి.మీ నుంచి 25 మి.మీ వరకూ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నదులకు జలకళ

తాజా వర్షాలకు నదులు జలకళ సంతరించుకున్నాయి. జయమంగళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కర్ణాటక ప్రాంతాలైన తుమకూరు, మధుగిరి, గుట్ట కొడిగెనహళ్లి తదితర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో జయమంగళి నదిలో వరద పారుతోంది. దీంతో శ్రీరంగరాజుపల్లి వద్ద నిర్మించిన కాజ్‌వేపై స్వల్పంగా నీరు ప్రవహిస్తోంది. చిత్రావతి నదిలోనూ నీరు పారుతోంది. అక్కడక్కడా చెక్ డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. పరిగి చెరువుకూ భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. నిడిమామిడి వద్ద వంగపేరు, గాజులపల్లి చెరువుకు మూడోసారి వరద వచ్చింది. గురువారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఖరీఫ్ పంటలకు నష్టం

రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా తుపాను ప్రభావం కూరగాయల రైతులపై తీవ్రంగా చూపింది. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో టమాట, వంకాయ, బీర, మిరప, కాకర, బెండ చెట్లు వేర్లు కుళ్లడం, కాయలపై తెగుళ్లు దాడితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పొలంలోని వేరుశనగ మొలకలు రాగా, ఇప్పటికే కుప్పలు వేసిన పంట వర్షానికి నానిపోయింది. ఇక కళ్లాల్లోని ఎండుమిర్చి కూడా బూజుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయింది. కంది పూత రాలిపోగా రైతులకు పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు.



లేపాక్షి మండలం మామిడిమాకులపల్లిలో పడిపోయిన ఇల్లు



ఎన్పీకుంటలో దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు



పెనుకొండ సమీపంలో పారుతున్న జయమంగళినది

చిగతుర్పి చెరువుకు గండి



జేసీబీ సాయంతో గండి పూడుస్తున్న అధికారులు

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలోని చెరువుకు గండి పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిగతుర్పి చెరువు బుధవారం నిండింది. దీంతో మరువ పారే స్థలంలో చెరువు కట్టకు గండి పడి నీరు భారీగా బయటికి ప్రవహిస్తోంది. అధికారులు స్థానికుల సాయంతో జేసీబీతో చెరువుకట్టకు మట్టి వేసి గండిని పూడ్చారు.

అప్రమత్తంగా ఉండాలి: జేసీ



గతంలో తెగిన రోడ్డును పరిశీలిస్తున్న జేసీ, తహసీల్దార్

తలుపుల: వర్షాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన తలుపుల మండలంలో పర్యటించారు. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన కదిరి –పులివెందుల రహదారితో పాటు, చెరువు తెగి కారులో ఇద్దరు కొట్టుకొని పోయిన పరిసరాలను పరిశీలించారు. అప్పట్లో చెరువుల్లో, కుంటల్లో నీరు ఉండడం.. భారీ వర్షాలతో అవన్నీ తెగడంతో రోడ్డు తెగిపోయిందని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని స్థానిక తహసీల్దార్ రెడ్డిశేఖర్ జేసీకి వివరించారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని రికార్డులు పరిశీలించారు.

సర్టిఫికెట్ల ధ్రువీకరణలో జాప్యం



అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణలో పరీక్షల విభాగం అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. బీటెక్ పూర్తి చేసి కంపెనీల్లో ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లు ఒరిజినలా? కాదా? అని ధ్రువీకరించేందుకు ఆయా కంపెనీలు థర్డ్‌పార్టీ వెరిఫికేషన్‌కు పంపుతారు. ఈ క్రమంలో థర్డ్‌పార్టీ తరఫున అందిన సర్టిఫికెట్ల ధ్రువీకరణలో జాప్యం నెలకొంటోంది. దీంతో దక్కిన ఉద్యోగాలను విద్యార్థులు కోల్పోవాల్సి వస్తోంది. వర్సిటీలో చదివినట్లు ధ్రువీకరించడంతో పాటు పాస్ అయినట్లు వర్సిటీ అధికారికంగా ఇచ్చిన సమాచారం ఆధారంగానే తొలుత కంపెనీలు ఉద్యోగంలో చేర్చుకుంటాయి. వెరిఫికేషన్‌లో ఆలస్యం జరిగి ఉద్యోగాలు కోల్పోవడం ద్వారా తాము చేయని తప్పునకు విద్యార్థులు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. జేఎన్‌టీయూఏ పరీక్షల విభాగంలో పరీక్షల విభాగం డైరెక్టర్‌తో పాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ముగ్గురు అడిషనల్ కంట్రోలర్లు ఉన్నారు. వాస్తవానికి ఒక అడిషనల్ కంట్రోలర్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. థర్డ్‌పార్టీ వెరిఫికేషన్ మాకు వద్దు.. అంటే మాకు వద్దు అని అడిషనల్ కంట్రోలర్లు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ నిర్లక్ష్యం చేస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఆలస్యం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యోగాలకు ఎంపికైన తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ఈ అంశంపై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడిషనల్ కంట్రోలర్‌కు ఈ బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు.

సచివాలయ శిలాఫలకాలు ధ్వంసం

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కొనసాగుతోంది. ఈక్రమంలోనే బుధవారం చెన్నేకొత్తపల్లి నుంచి న్యామద్దెలకు వెళ్లే రోడ్డులో గవర్నమెంటు ఆస్పత్రి పక్కనే నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఒకవైపు అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిత్రం ఉండగా, మరోవైపు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం ఉంది. ఈ రెండింటినీ ధ్వంసం చేశారు. అలాగే జాతీయ రహదారి పక్కన నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, స్టీల్ గ్రిల్‌ను ధ్వసం చేశారు. బుధవారం సాయంత్రం అటుగా వెళ్లిన వారు శిలాఫలకాలు ధ్వంసమై ఉండటం గమనించి సచివాలయ, విలేజ్ క్లినిక్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



చెన్నేకొత్తపల్లి గ్రామ సచివాలయ శిలాఫలకాలు ధ్వంసం చేసిన దృశ్యం

బెదిరింపులు.. దౌర్జన్యాలు

మద్యం దుకాణాల కోసం అధికార పార్టీ నేతల బెదిరింపులు, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆర్జనే ధ్యేయంగా మద్యం వ్యాపారంపై ఆధారపడిన అధికార పార్టీ నేతలు.. జిల్లాలో చాలా చోట్ల సిండికేటుగా మారి మద్యం షాపులను స్వాధీనం చేసుకున్నారు. తమ మాట వినని వారిని బెదిరించి... దౌర్జన్యం చేసి దుకాణాల నిర్వహణ చేపట్టారు. ఈ క్రమంలోనే టీడీపీ నేతల మధ్యే పోటీ నెలకొంది. దీంతో గ్రూపు తగాదాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల దుకాణం నిర్వహణ పంచాయితీ తెగలేదు. అందువల్లే తొలిరోజు సగం షాపులు కూడా తెరచుకోలేదు.

- మద్యం షాపుల కోసం గ్రూపుల లొల్లి
- హిందూపురంలో బాలయ్య వర్సెస్ అంబికా
- పెనుకొండలో మంత్రి సవిత వర్సెస్ ఎంపీ పార్థసారథి
- ధర్మవరంలో బీజేపీ, టీడీపీ మధ్య పోటా పోటీ
- తొలిరోజు తెరచుకోని సగం దుకాణాలు
- లేపాక్షి 57వ నంబర్ దుకాణంపై తెగని పంచాయితీ



ధర్మవరంలో బాల్‌రెడ్డి మద్యం దుకాణంలో ధ్వంసమైన మద్యం బాటిళ్లు, కంప్యూటర్ పరికరాలు

సాక్షి, పుట్టపర్తి: మద్యం దుకాణాలను ప్రైవేటు పరం చేయడంతో జిల్లా వ్యాప్తంగా కూటమి పార్టీల నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారిని బెదిరించడం.. దౌర్జన్యం చేయడం, కిడ్నాప్ చేసేందుకూ వెనకాడటం లేదు. చాలా చోట్ల లాటరీ కంటే ముందే సిండికేటుగా మారి 'గుడ్‌విల్' ఇచ్చేసి దుకాణాలు సొంతం చేసుకున్నారు. తమ మాట వినని వారిని పలు విధాలుగా బెదిరిస్తున్నారు. ధర్మవరం, పెనుకొండ, హిందూపురంలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. పుట్టపర్తి, కదిరి, మడకశిర నియోజకవర్గాల్లో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం.. లాటరీలో ఎవరికి దుకాణం దక్కినా... నిర్వహణ మాత్రం టీడీపీ నేతలే చూస్తున్నారు.

హిందూపురంలో ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

సినీనటుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో ఎక్కువ దుకాణాలు టీడీపీ నాయకులకే దక్కాయి. ఒకటి, రెండు దుకాణాలు లాటరీలో ఇతరులు దక్కించుకున్నా ఎమ్మెల్యే అనుచరులు వారిని బెదిరించి దుకాణం సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నట్లు సమాచారం. లేపాక్షి 57వ నంబర్ దుకాణం దక్కించుకున్న రంగనాథ్‌ను బాలయ్య వర్గీయులు కిడ్నాప్ చేయగా.. అంబికా వర్గం అతనికి మద్దతుగా నిలిచినట్లు తెలిసింది.

పెనుకొండలో మంత్రి సవిత వర్సెస్ ఎంపీ బీకే

మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో లాటరీలో షాపు దక్కించుకున్న వారి నుంచి లాక్కునేందుకు ఆమె అనుచరులు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమందేపల్లి, పెనుకొండలో షాపుల పంచాయితీ ఇంకా తెగలేదు. ఆయా దుకాణాలను మంత్రి అనుచరులు దక్కించుకోవాలని చూడగా... లాటరీలో దుకాణం దక్కించుకున్న వారికి ఎంపీ బీకే పార్థసారథి మద్దతుగా నిలిచినట్లు తెలుస్తోంది.

ధర్మవరంలో టీడీపీ వర్సెస్ బీజేపీ

మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరంలో మద్యం దుకాణాలన్నీ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలోనే నడవాలని.. అతని అనుచరులు గొడవలకు దిగుతున్నారు. అంతేకాకుండా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన బాల్‌రెడ్డికి ధర్మవరంలో ఓ షాపు దక్కగా.. మంగళవారం రాత్రి దుండగులు ప్రవేశించి మద్యం బాటిళ్లు పగలగొట్టారు. బీజేపీ నేత సందిరెడ్డి శ్రీనివాసులుకు నియోజకవర్గంలో ఐదు మద్యం దుకాణాలు దక్కగా.. రాయ'బేరాలు' నడుస్తున్నట్లు తెలిసింది.

రూ.15.55 కోట్ల మద్యం సరఫరా

కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రి వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని 223 దుకాణాలకు రూ.15.55 కోట్ల విలువైన మద్యం సరఫరా చేసినట్లు అనంతపురం లిక్కర్ గోడౌన్ అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ ఐఎంఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) 16,800 కేసులు, బీర్లు 6,008 కేసులు కలిపి మొత్తం 22,808 కేసుల మద్యం ఆయా షాపులకు లిక్కర్ గోడౌన్ నుంచి వెళ్లింది. ఇక జిల్లాలో తొలిరోజు సగం షాపులు కూడా ప్రారంభం కాలేదు. బుధవారం సాయంత్రానికి కేవలం 16 షాపులు మాత్రమే ప్రారంభమయ్యాయి.

తెగని లేపాక్షి పంచాయితీ

హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో లేపాక్షిలోని 57వ షాపు నంబరు దుకాణానికి సంబంధించి పంచాయితీ తెగలేదు. ఆ మద్యం దుకాణం లాటరీలో రంగనాథ్ దక్కించుకోగా, ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచరులు అతన్ని కిడ్నాప్ చేశారు. అతని భార్య పోలీసులను ఆశ్రయించడంతో అనంతరం విడుదల చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో అతను సోమవారం కాకుండా మంగళవారం ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ ఫీజు చెల్లించాడు. అయితే ఇంకా అప్‌డేట్ కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈక్రమంలో అతడికే దక్కుతుందా? అన్నది సస్పెన్స్‌గా మారింది. మరోవైపు తన వద్ద డబ్బులు లేవని... వేరే ఎవరికైనా దుకాణం కేటాయించుకోవచ్చని రాసి రంగనాథ్ సంతకం చేసిన పేపరు ఎక్సైజ్ కార్యాలయంలో ఉంది. దీంతో ఎవరికి అనుమతులు ఇస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

ఆరు దుకాణాలకు లైసెన్స్ సొమ్ము చెల్లించని వైనం

సీకే పల్లి, ధర్మవరం, హిందూపురం, కదిరి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఆరు షాపులకు సంబంధించి ఇంకా పంచాయితీ తెగలేదు. ఎవరూ డబ్బులు కట్టకపోవడంతో ఎవరికి లైసెన్సు వస్తుందనే దానిపై గందరగోళం నెలకొంది. లాటరీలో దక్కించుకున్న వారిని బెదిరింపులకు గురి చేసినట్లు సమాచారం. దీంతో సదరు వ్యక్తులు డబ్బు చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో ఆ దుకాణాలు ఎవరికి ఇవ్వాలనే దానిపై ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

కంట్రోల్ రూమ్ పరిశీలన



అల్పపీడన ద్రోణి కదలికలను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి తాజా సమాచారం అందుతుందని, దీనిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. 17వ తేదీ జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్నందున అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

యూపీ వాసి దుర్మరణం

తాడిపత్రి అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నవ్ జిల్లా రోషన్‌గంజ్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (39) రెండేళ్ల క్రితం తన భార్య, పిల్లలతో కలసి తాడిపత్రికి వలస వచ్చి నందలపాడులో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ద్విచక్ర వాహనంపై ఐస్‌క్రీమ్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై ఐస్‌క్రీమ్ బాక్స్ పెట్టుకుని వెళుతుండగా సీబీ రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

రెండు టిప్పర్లు, ట్రాక్టర్ పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఓ ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రభాకర్ అప్రమత్తం చేయడంతో స్థానిక జాతీయరహదారిపై లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, సిబ్బంది బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన రెండు టిప్పర్లు, ఓ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

19న పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగమేళా

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసున్న అభ్యర్థులు అర్హులు. ఉద్యోగాలకు ఎంపికైనవారు హైదరాబాద్, బెంగళూరులో పనిచేయాల్సి ఉంటుంది. నెలకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు జీతం చెల్లిస్తారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే యువతీయువకులు బయోడేటాతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు వెంట తీసుకెళ్లాలి.

విధి వంచితులు

- క్యాన్సర్‌తో పోరాడుతూ ఆస్పత్రి పాలైన ఇల్లాలు
- అప్పు కోసం ఇంటికి వచ్చిన భర్త
- అనుకోని ప్రమాదంలో కాలు విరిగి ఆస్పత్రి పాలు
- అదే సమయంలో ఆస్పత్రిలో కన్నుమూసిన ఇల్లాలు
- విధి వంచితులైన ఇద్దరు చిన్నారులు

పొదరిల్లులా అల్లుకున్న ఓ కుటుంబ బంధాన్ని విధి ఒక్కొక్కటిగా తుంచేస్తోంది. క్యాన్సర్‌తో సతమతమవుతున్న ఇల్లాలిని ఆస్పత్రిలో చేర్పించి ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వలేక అప్పు కోసం వచ్చిన ఇంటి పెద్దను ప్రమాదం అవిటివాడిని చేసింది. అదే సమయంలో ఇల్లాలు కన్నుమూసింది. అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్న వయసులో ఇద్దరు చిన్నారులు తల్లి మృతదేహం వద్ద దీనంగా ఏడుస్తుంటే కనీసం వారిని అక్కున చేర్చుకుని ఓదార్చలేని స్థితిలో తండ్రి కుమిలికుమిలి రోదించాడు. విధి ఆడిన ఈ నాటకంలో బలి అయింది మాత్రం చిన్నారులే. కదలలేక మంచాన పడిన నాన్నకు చికిత్స అందించే ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు.



కాలు విరిగి నేలపై పడుకున్న నరసింహులు

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి దళిత వాడలో నివాసముంటున్న హరిజన నరసింహులు, దుర్గమ్మ (30) దంపతులకు ఏడేళ్ల వయసున్న అనన్య, ఐదేళ్ల వయసున్న నదీష్ అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఓ చిన్నపాటి పూరి గుడిసె తప్ప మరో ఆస్తిపాస్తులేమీ లేవు. రోజూ కూలి పనులకు వెళితే తప్ప పూట గడవని పరిస్థితి.

కబళించిన క్యాన్సర్

అరకొర సంపాదనలోనే పిల్లల భవిష్యత్తు కోసం కొంత దాచి ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్న తరుణంలో ఆ నిరుపేద కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు చికిత్స కోసం పలు ఆస్పత్రుల చుట్టూ నరసింహులు తిరిగాడు. అయినా నయం కాలేదు. దీంతో బెంగళూరుకు పిలుచుకెళ్లి చూపించాడు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం ఆమె క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పిల్లల భవిష్యత్తు కోసం దాచిన డబ్బు కాస్త భార్య చికిత్సకు ఖర్చు పెట్టాడు. అయినా ప్రయోజనం దక్కలేదు. దీంతో అప్పు చేయాల్సి వచ్చింది. తెలిసిన వారి వద్ద అప్పు చేసి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తూ వచ్చాడు.

అప్పు కూడ పుట్టక...

నరసింహులు కుటుంబంపై కక్ష కట్టిన విధి... చివరకు అప్పు కూడా పుట్టకుండా చేసింది. దీంతో చేతిలో ఉన్న డబ్బు కాస్త అయిపోవడంతో దిక్కుతోచని స్థితిలో బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యను మంగళవారం డిశ్చార్జ్ చేయించుకుని కర్ణాటకలోని పావగడ తాలూకా నెనగానిపల్లిలోని ఆమె పుట్టింటికి తీసుకెళ్లాడు. పరిస్థితి మొత్తం అత్తింటి వారికి వివరించి, తాను గ్రామానికి వెళ్లి డబ్బు సమకూర్చుకుని వస్తానని, అప్పటి వరకూ తన భార్యను జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడు. అదే రోజు రెడ్డిపల్లికి చేరుకుని అప్పు కోసం ప్రతి ఇంటి తలుపూ తట్టాడు. అయినా ఎక్కడేగాని నయాపైసా ఇచ్చేవారు కనిపించలేదు. తన భార్య దైన్య స్థితిని వివరించి ప్రాధేయపడ్డాడు. ఇప్పటికే చాలా డబ్బు ఇచ్చామని, ఆ మొత్తం చెల్లించిన తర్వాతనే కొత్త అప్పు ఇస్తామంటూ కొందరు వడ్డీ వ్యాపారులు చేతులెత్తేశారు.



తల్లి మృతదేహం వద్ద చిన్నారులు

అపహసించిన విధి

గ్రామంలో అప్పు పుట్టక దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న నరసింహులుకు బుధవారం ఉదయం అత్తింటి వారి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దుర్గమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, వెంటనే వచ్చి ఇంటికి పిలుచుకెళ్లాలని అత్తింటి వారు తెలపడంతో వెంటనే నెనగానిపల్లికి బయలుదేరాడు. మార్గం మధ్యలో పావగడలో దిగి నెనగానిపల్లికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తూ ఓ పాత గోడ కిందకు చేరుకున్నాడు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాగా తడిసిన పాత గోడ అప్పటికే మొదలైన వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న నరసింహులును స్థానికులు వెలికి తీసి, పావగడలోని ఆస్పత్రికి చేర్చారు. కుడికాలు విరిగింది. ఎడమకాలు తొడపై బలమైన మూగదెబ్బలు తగిలాయి. ఆస్పత్రిలో విరిగిన కాలుకు వైద్యులు కట్టు కడుతున్న సమయంలోనే అత్తింటి వారు ఫోన్ చేసి దుర్గమ్మ చనిపోయిందని తెలిపారు. విధి మరోసారి తనను వెక్కిరించడంతో ఆస్పత్రిలోనే నరసింహులు కన్నీరుమున్నీరుగా విలపించాడు.

అశ్రునయనాలతో అంతిమ సంస్కారం

నరసింహులు పరిస్థితిని తెలుసుకున్న బంధువులు ఓ వైపు దుర్గమ్మ మృతదేహాన్ని, మరో వైపు నరసింహులునూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయించుకుని రెడ్డిపల్లికి చేర్చారు. విషయం తెలుసుకున్న గ్రామం మొత్తం బాధితుల పూరి గుడిసె వద్దకు చేరుకుంది. ఓ వైపు భార్య మృతదేహం... మరో వైపు నేలపైనే కదలలేని స్థితిలో ఉన్న భర్తను చూసి కంట తడి పెట్టారు. అంతిమ సంస్కారాలు చేసేందుకు సైతం చేతిలో చిల్లిగవ్వ లేక నరసింహులు పడుతున్న ఇబ్బందిని గుర్తించిన పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేశారు. 'అమ్మా! లే అమ్మ... ఒక్కసారి కళ్లు తెరిచి చూడమ్మ' అంటూ రోదిస్తున్న చిన్నారులను చూసి కంట తడి పెట్టని వారంటూ లేరు. ఈ నేపథ్యంలో నాన్న చికిత్సకు సాయం చేయాలని చిన్నారులు అభ్యర్థిస్తున్నారు.

దాతలు సాయం చేయదలిస్తే...

పేరు : ఎం.రామాంజనేయ (బాధితుడి బావమరిది)
బ్యాంక్ : బ్యాంక్ ఆఫ్ బరోడా, పావగడ బ్రాంచ్
ఖాతా నంబర్ : 6747 010 001 7923
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : BARB0VJPAVA
ఫోన్‌పే నంబర్ : 63623 74677

పర్యావరణ సుస్థిరతతోనే మానవాళి మనుగడ

- అంతర్జాతీయ సదస్సులో వక్తలు



అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు.హెచ్

అనంతపురం: పర్యావరణ సుస్థిరతతోనే మానవాళి మనుగడ సాధ్యమని జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సుదర్శనరావు.హెచ్ అన్నారు. 'మెంబరెన్స్ ప్రాసెస్ ఫర్ ఏ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్' అంశంపై జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును ఇన్‌చార్జ్ వీసీ ప్రారంభించి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో మెంబరిన్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణంలో మార్పులను అరికట్టాలంటే మెంబరిన్ టెక్నాలజీ అనివార్యమన్నారు. మేథో వికాసానికి ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు దోహదపడతాయన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన సదస్సును జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో నిర్వహించడం గర్వకారణమన్నారు. కాగా, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ వ్యవహరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. 17 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొనగా... కొందరు వర్చువల్ విధానంలో ప్రసంగించారు. పోలాండ్‌లోని టోరన్ నగరంలో ఉన్న మెంబ్రెన్, మెంబ్రెన్ టెక్నిక్స్ రీసెర్చ్ గ్రూపు నైకోలస్ కొపరినెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఓజిచ్ కుజైవిస్కి, హైదరాబాద్‌లోని మెంబర్ ల్యాబ్ సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్, తిరుపతి ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ కేఎస్ఎంఎస్ రాఘవరావు, ఐఎంఎస్ చైర్మన్ ప్రొఫెసర్ సీఎస్ మూర్తి, గుజరాత్‌లోని వడోదరలో ఉన్న పర్మోనిక్స్ మెంబరాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి సత్యజేయి మేయర్, ముంబయి ఐఐటీ ప్రొఫెసర్ సత్యప్రతాప్ సింగ్, ఐఎన్‌డీ చైర్మన్ ప్రొఫెసర్ వీకే శ్రీవాస్తవ, తిరుచారాపల్లిలోని ఎన్ఐటీ ప్రొఫెసర్ జి.అర్ధనారీశ్వరన్, ఖరగ్‌పూర్ ఐఐటీకి చెందిన డాక్టర్ షీర్షేందు దే, న్యూయార్క్‌లోని కెమ్ ఫినిటీ టెక్నాలజీ డాక్టర్ రవీంద్ర రెవనార్, కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఉష.కె.అరవింద్, చెన్నైలోని అన్నా యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.బాలసుబ్రమణియన్ ముఖ్య వక్తలుగా ప్రసంగించారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

ధర్మవరం రూరల్: మండలంలోని నాగలూరు గ్రామానికి చెందిన జానకి, శంకర్ దంపతులు బుధవారం కుటుంబకలహాల నేపథ్యంలో వాగ్వాదం చేసుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శంకర్ అక్కడే ఉన్న కట్టెతో భార్యపై దాడి చేయడంతో ఆమె తలపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించారు.

'అనంత'లో వైభవ్ జ్యువెలర్స్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న అంజనాసిన్హా (చిత్రంలో) ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, వైభవ్ సంస్థల సీఎండీ రత్నకుమారి తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ప్రముఖ వైభవ్ జ్యువెలర్స్ సంస్థ తన 16వ బ్రాంచ్‌ను అనంతపురంలోని రాజు రోడ్డులో బుధవారం అట్టహాసంగా ప్రారంభించింది. కళ్యాణదుర్గం, అనంతపురం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అంజనా సిన్హా ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి గడించిన వైభవ్ జ్యువెలర్స్ అనంతపురంలో బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారి మాట్లాడుతూ.. వినియోగదారులకు అద్భుత శ్రేణి షాపింగ్‌తో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్‌మార్క్ కలిగిన బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, ఇన్‌స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్ తదితర ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైభవ్ హోల్‌టైమ్ డైరెక్టర్ సాయికీర్తన గ్రంధి, సీఓఓ గొంట్ల రాఘాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, అమరేంద్ర గ్రంధి తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై విహరించిన శ్రీవారు



గజవాహనంపై విహరిస్తున్న చింతల వెంకటరమణస్వామి

తాడిపత్రి అర్బన్: లక్ష్మీచింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామి వారు గజవాహనంపై పుర వీధుల్లో విహరించారు. ఉదయం స్వామి వారు శ్రీదేవి,భూదేవి సమేతుడై వేణుగోపాలస్వామి అలంకరణలో పురవీధుల్లో విహరించారు. గజ వాహనంపై ఉన్న శ్రీవారిని వీక్షిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో స్వామి దర్శనానికి పోటెత్తారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య శ్రీవారి ఊరేగింపు సాగింది..

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీచింతల వెంకటరమణస్వామి స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం ఉంటుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వర్షం కారణంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పందిళ్లు వేశారు. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సాయి ఆరామంలో నేడు వాల్మీకి జయంతి

ప్రశాంతి నిలయం: స్థానిక సాయి ఆరామంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించనున్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు వేడుక ప్రారంభమయ్యే ఈ వేడుకలో జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు పాల్గొననున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు నమోదు



మృతురాలు సంగీత

పుట్లూరు: కర్ణాటక ప్రాంతానికి చెందిన మహిళ మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కర్ణాటకలోని బీదర్ జిల్లా దుబల్‌గుండి గ్రామానికి చెందిన వివాహిత సంగీత (21) పుట్లూరు మండలం ఎ.కొండాపురంలోని పవిత్ర హోటల్‌లో కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమె తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమెకు భర్త నాగరాజు, మూడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. ఆమె మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ శేషారెడ్డి సమక్షంలో పోలీసులు పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరం: స్థానిక దుర్గానగర్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 11 మందిని టూటౌన్ సీఐ రెడ్డప్ప అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.1,16,750 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

కారును ఢీకొన్న కంటైనర్

అమడగూరు: స్థానిక కొక్కంటి క్రాస్ ప్రధాన రహదారిలో కుమ్మరిండ్లు గ్రామం వద్ద బుధవారం ఓ కంటైనర్, కారు ఢీకొన్నాయి. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. నల్లచెరువులోని మగ్గాల క్వార్టర్స్‌కు చెందిన బాలనరసింహులు, రెడ్డిశేఖర్, వెంకటేష్, శంకర్ కర్ణాటకలోని చాకివేలు నుంచి కారులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమై వెళుతుండగా కుమ్మరిండ్లు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కియా కార్లను తరలించే కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం జడివానలోనే సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖద్వారం నుంచి విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవం దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా.. 10 మందికి గాయాలు

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బోల్తా పడి పది మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 60 మంది ప్రయాణికులతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో హంపాపురం సమీపంలో బోల్తా పడింది. ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 ద్వారా అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్ జైలులో సౌకర్యాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

కళ్యాణదుర్గం: జైలులో ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ సూచించారు. స్థానిక కళ్యాణదుర్గం సబ్ జైలును బుధవారం ఆయన పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న భోజన నాణ్యత, మరుగుదొడ్లు, స్టోర్ రూంను తనిఖీ చేశారు. బ్యారక్‌లలో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికి వెళ్లాక మరోసారి ఎలాంటి తప్పులు చేయకుండా మంచిగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు టి.దాదాఖలందర్, రామాంజనేయులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

జింక పిల్లను కాపాడిన గొర్రెల కాపర్లు



ఫారెస్ట్ అధికారికి జింక పిల్లను అందిస్తున్న గొర్రెల కాపర్లు

కళ్యాణదుర్గం రూరల్: పాలవాయి గ్రామంలోని అటవీప్రాంతంలో కుక్కలు జింకపిల్లను తరుముతుండగా పాలవాయి గ్రామానికి చెందిన గొర్రెలకాపర్లు రక్షించారు. అనంతరం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించి జింకపిల్లను ఫారెస్టు అధికారిణి రామేశ్వరమ్మకు అందజేశారు. ఈసందర్భంగా ఫారెస్టు అధికారిణి గొర్రెలకాపర్లను అభినందించారు.

చరిత్ర తిరగరాసిన 'కంది'

- ఈ ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 1.03 లక్షల హెక్టార్లలో సాగు
- గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70 వేల హెక్టార్లకు మించింది లేదు
- ఈసారి సగానికి తగ్గిన వేరుశనగ, పత్తి సాగు విస్తీర్ణం
- ఓవరాల్‌గా 92 శాతం సాగుతో 3.20 లక్షల హెక్టార్లలో 'ఖరీఫ్'



ఈ ఖరీఫ్‌లో సాగైన కంది పంట

అనంతపురం అగ్రికల్చర్: కంది పంటపై ఈ సారి రైతులు చాలా మక్కువ చూపారు. చరిత్ర తిరగరాస్తూ ఈ ఖరీఫ్‌లో ఏకంగా 1.03 లక్షల హెక్టార్లలో కంది సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 37,367 హెక్టార్లు కాగా 277 శాతం అధిక విస్తీర్ణంలో సాగులోకి రావడం విశేషం. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా ఈ స్థాయిలో కంది సాగులోకి రాలేదు. 2017లో అత్యధికంగా 71 వేల హెక్టార్లుగా నమోదైంది. ఆ తర్వాత 50 వేల నుంచి 60 వేల హెక్టార్లలో సాగవుతూ వస్తోంది. ఈ సారి లక్ష హెక్టార్లకు అధిగమించి ప్రధానపంట వేరుశనగతో పోటీ పడటం గమనార్హం. ఇలాగే రెండు మూడేళ్లు కొనసాగితే జిల్లాలో ప్రధానపంటల జాబితాలో వేరుశనగను వెనక్కినెట్టి కంది మొదటి స్థానంలో నిలవడం ఖాయమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సగానికి తగ్గిన వేరుశనగ, పత్తి..

ఈ ఖరీఫ్‌లో అపుడపుడు కురిసిన మోస్తరు వర్షాలకే జిల్లా రైతులు పంటల సాగు కొనసాగించారు. ఈ క్రమంలో వేరుశనగపై రైతులు అనాసక్తి ప్రదర్శించారు. దీంతో సాధారణ సాగు విస్తీర్ణం 1.98 లక్షల హెక్టార్లు కాగా 57 శాతంతో 1.12 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగులోకి వచ్చింది. అలాగే సయమానికి వర్షాలు పడకపోవడంతో పత్తి సాగు కూడా 48,586 హెక్టార్లకు గానూ 59 శాతంతో 28,530 హెక్టార్లలో వేశారు. ఈ రెండు ప్రధాన పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గినందున వాటి స్థానంలో కంది సాగు పెరగడం విశేషం. మరో ప్రధాన పంటల జాబితాలో ఉన్న ఆముదం 97 శాతంతో 15,847 హెక్టార్లు, మొక్కజొన్న 173 శాతంతో 19,978 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ సారి అంచనాకు మించి కంది, మొక్కజొన్నతో పాటు కొర్ర కూడా 2,001 హెక్టార్లకు గానూ 449 శాతం అధికంగా 8,994 హెక్టార్లలో వేశారు. అలాగే సజ్జ కూడా 1,610 హెక్టార్లకు గానూ 202 శాతం అధికంగా 3,251 హెక్టార్లలో సాగు చేశారు. ఇక రాగి, ఉలవ, పెసర, అలసంద, మినుము, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర పంటలు నామమాత్రపు విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. నీటి వసతి కింద 22 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. ఓవరాల్‌గా తీసుకుంటే ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లు అంచనా వేయగా... చివరకు 92 శాతం విస్తీర్ణంతో 3.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. పంట దిగుబడుల విషయానికి వచ్చినా వేరుశనగ, పత్తి, ఆముదం పంట దిగుబడులు బాగా తగ్గిపోగా... ప్రస్తుతం పూత దశలో ఉన్న కంది కొంత వరకు ఆశాజనకంగా ఉన్నందున దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. వాతావరణం, వర్షాలను బట్టి కంది ఎంత వరకు రైతులను గట్టెక్కిస్తుందనేది వేచి చూడాలని చెబుతున్నారు.